క్లుప్తంగా

గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలి



గృహ నిర్మాణాలపై స్థానికుడితో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ నాగరాజు

సి.బెళగల్: జగనన్న కాలనీలలో జరుగుతున్న గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలని హౌసింగ్ ఈఈ నాగరాజు సూచించారు. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామం జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఆయన మండల హౌసింగ్ ఏఈ సుమంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అదే విధంగా గ్రామంలో లబ్ధిదారులు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సహకాలను ఈఈ వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది రంగన్న, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ లక్ష్మి, ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం



పాతబస్టాండ్ ప్రధాన రహదారిపై ఉన్న గుంత

గడివేముల: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న వెలుగోడు రస్తాలో ప్రధాన రహదారిపై రోడ్డు దెబ్బతిని గుంత ఏర్పడింది. పాత బస్టాండు నుంచి నంద్యాల, నందికొట్కూరు, వెలుగోడుకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికే పలువురు గుంతలో పడి గాయాలపాలైన ఘటనలూ ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య మేళాపై అవగాహన



పరీక్షలు చేస్తున్న ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి

పాణ్యం: మండల కేంద్రంలో మంగళవారం ఆయుర్వేద ఆరోగ్య మేళా నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి, ఆరోగ్యకరమైన జీవన విధానం గురించి డాక్టర్ శ్రీదేవి తెలియజేశారు. అనంతరం ఆయుష్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకురాలు అనురాధ, ఏఎన్‌ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మాధవ స్వామి ఆలయం

- మరమ్మతులు చేయాలని కోరుతున్న ప్రజలు



శిథిలావస్థలో ఉన్న ఆలయం

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో వెలసిన మాధవస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయంపై మొక్కలు మొలిచి వేర్లు గోడల్లోకి పాకడంతో చిన్న పాటి వర్షానికే ఒడుస్తోంది. దీంతో గోడలు పొచిపట్టి నెర్రెలిస్తున్నాయి. అర్చకులు, భక్తులు ఆలయంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కొద్దిరోజులుగా భజన కూడా ఆరుబయటే చేస్తున్నారు. ఇప్పటికైనా దేవదాయశాఖ అధికారులు మరమ్మతులు చేయించి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

29న 'జగనన్నకు చెబుదాం'

పాణ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 29న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై వినతులు ఇవ్వాలని సూచించారు.

శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



సబ్సిడీ శనగ విత్తనాలకై రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

కోడుమూరు రూరల్ : రబీ సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ రైతులకు సూచించారు. మంగళవారం కోడుమూరులోని రైతుభరోసా కేంద్రాల్లో ఏఓ శనగ విత్తనాలు అవసరమైన రైతుల పేర్లను యాప్‌లో నమోదు చేశారు. ఏఓ మాట్లాడుతూ మండలానికి 3,000 క్వింటాళ్ల శనగ విత్తనాలను మంజూరయ్యాయన్నారు. క్వింటాం ధర 8,100 ఉండగా 40శాతం సబ్సిడీ పోను రైతులు రూ.4,860లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతేడాది ఎకరాకు 25కిలోల ప్రకారం పంపిణీ చేయగా, ఈ ఏడాది రైతుల కోరిక మేరకు ఎకరాకు 40కిలోల చొప్పున శనగ విత్తనాలను ప్రభుత్వం అందజేస్తోందని ఏఓ పేర్కొన్నారు.

రైతన్నా.. సమయం లేదు!

- పంట నమోదుకు నాలుగు రోజులే గడువు
- సాగైన ప్రతి పంటనూ నమోదు చేయించుకోవాలని అధికారుల సూచన
- ఇప్పటి వరకు 18 వేల ఎకరాలకు ఈ క్రాప్ బుకింగ్ పూర్తి



బిలకలగూడూరు సమీపంలో ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న ఏఓ, వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

గడివేముల: సాగు ప్రయోజనాలను సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పంట విధానం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ పంటలను రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బంది రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. క్షేత్రస్థాయికే వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది వెళ్లి పంటల నమోదు కార్యక్రమం చేపడుతున్నారు. ఈ నెల 30 వరకు మాత్రమే సమయం ఉండటంతో ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 23 వేల ఎకరాలు సాగులోకి వచ్చినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రత్తి, వరి, మొన్నజొన్న, మిరప, సోయాబీన్, మినుము పంటలు సాగుచేశారు.

ఎన్నో ప్రయోజనాలు..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్‌కు, రబీ సీజన్లకు సంబంధించి పంటల బీమాను ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవడం ద్వారా ఏదేని కారణంగా పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం దళారుల చేతికి వెళ్లకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ అవుతుంది. పంట నమోదుతో ఏ రైతు ఏ పంట ఎంత మొత్తంలో సాగు చేశారో స్పష్టంగా తెలుస్తుంది. పంట దిగుబడులను అంచనా వేయవచ్చు. పంట మార్పిడికి అవకాశం ఉంటుంది. గతంలో పంట బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే సగం డబ్బు రైతులు చెల్లించి, మిగిలిన సొమ్మును ప్రభుత్వం చెల్లించేది. ఇందులో ఉన్న లోపాలను గుర్తించిన ప్రభుత్వమే బీమా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంది. మండలంలో ఎంత విస్తీర్ణంలో సాగు భూమి ఉంది,ఏ సీజన్‌లో ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, తదితర వివరాలను క్షుణ్ణంగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. పండించిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడానికి ఈ క్రాప్ ఎంతో సహాయపడుతుంది. వైఎస్సార్ యంత్రాసేవా పథకం అమలు, నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతుభరోసా కేంద్రాల ద్వారా లభ్యమవుతున్నాయి.

మద్దతు ధర లభిస్తుంది



ఏ సీజన్‌లో ఏ పంట వేసినా ఏటా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకుంటున్నాను. పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తోంది. ప్రతి రైతు ఆనందంగా ఉన్నారు. దళారీవ్యవస్థ లేకుండా అమ్ముకొని నేరుగా తన అకౌంట్లోనే డబ్బులు పడతాయి. సబ్సిడీతో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు పొందటంతో పాటు, పంటల బీమాను పొందవచ్చు. పంటల నమోదు చేసుకుంటే అర్హులకు అన్యాయం జరగదు.

– బండపల్లె రమేష్, రైతు, దుర్వేశి గ్రామం

పూర్తి శాతం చేస్తాం



ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటను ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్నాం. పొలం వద్దకే వెళ్లి పంటల వివరాలను నమోదు చేస్తున్నాం. ఇప్పటి వరకు 90 శాతం వరకు పూర్తయింది. ఈ నెల 30 వరకు గడువు ఉంది. అప్పటి లోపు 100 శాతం నమోదు చేస్తాం.

– హేమసుందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించండి



పోలకల్ జెడ్పీ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలిస్తున్న ఏఎంఓ ప్రసాద్

సి.బెళగల్: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) ప్రసాద్, అసిస్టెంట్ ఏఎంఓ శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పోలకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ పాఠ్యాంశాలపై జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ విద్య లక్ష్యాలను ఉపాధ్యాయులకు వివరించారు. విద్యాబోధన విధానాలు, విద్యార్థుల సంసిద్ధత అంశాలను విశదీకరించారు. అదేవిధంగా మండలంలోని సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో గణితం పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. బుధవారం బురాన్‌దొడ్డి జెడ్పీ హైస్కూల్లో సోషల్, సంగాల జెడ్పీ హైస్కూల్లో తెలుగు, హిందీ పాఠ్యాంశాలపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నిర్మల వసంత కుమారి, సునీల్ రాజు తెలిపారు.



టోకెన్లు అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

ఇంటింటా ఆరోగ్యం

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

ఓర్వకల్లు: సాధారణ రోగులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసి అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి స్థానిక హెల్త్‌సెంటర్ ఆవరణంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మండల స్థాయి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడ్, రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రవీంద్రరెడ్డి, జిల్లా అధికారులు, సర్పంచ్, తహసీల్దార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కోడుమూరు రూరల్ : వర్షాభావ పరిస్థితుల పంటలు ఎండిపోయి నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు కోరారు. కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడంతో పాటు, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ, రైతు సంఘం నేతలు రాముడు, రాజు, మధు, రాములు, రంగడు, సత్తన్న, బజారి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

వీర వనిత చాకలి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): తెలంగాణ సాయుధ పోరులో వీరోచితంగా భూపోరాటం నడిపిన వీర వనిత చాకలి ఐలమ్మ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి, రజక ఫెడరేషన్ అధ్యక్షులు రజక శ్రీనివాసులు, బీసీ నాయకులు బత్తుల లక్ష్మికాంతయ్య, యూనుస్ బాషా, సీపీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రజక ఐక్య సేవా సమితి ఆధ్వర్యంలో..

చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి స్థానిక బీసీ భవన్‌లో రజక ఐక్య సేవా సమితి నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి సీపీ వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు భారతి, జిల్లా అధ్యక్షులు బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



కోడుమూరులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఈఓ అజయ్‌భాస్కర్



కొరటమద్ది గ్రామంలో ఆరోగ్య సురక్షలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



కౌలూరులో టోకెన్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది



తడకనపల్లిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎంపీహెచ్‌ఓ, సూపర్‌వైజర్

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ అజయ్ భాస్కర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో జరుగుతున్న సర్వేను ఈఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈనెల 30వతేదీ నాటికి ఏఎన్‌ఎంలు, వలంటరీలు సర్వేను పూర్తి చేసి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి హెల్త్ క్యాంపుల్లో వైద్యసేవలు అందేలా చూడాలని ఏఎన్‌ఎంలు, వలంటరీలకు ఈఓ సూచించారు.

గడివేముల మండలంలో..

గడివేముల: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని కొరటమద్ది, కొర్రపోలూరు గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను డాక్టర్ మొల్లా జబీన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది, వలంటీర్లు వచ్చి వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసుకుంటారని, అవసరమైతే స్పెషలిస్ట్ వైద్యుడితో చూపించుకునేందుకు టోకెన్లు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌలూరులో..

పాణ్యం: మండలంలోని కౌలూరు గ్రామంలో మంగళవారం ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిచారు. బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. కొందరికి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చూపించుకునేందుకు టోకెన్లు అందజేశారు.

కల్లూరు మండలంలో..

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం తడకనపల్లె, కొంగనపాడు గ్రామాల్లో ఇంటింటి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేశారు. వృద్ధులకు, ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



స్టాంటన్‌పురంలో గణేశ్ నిమజ్జనంలో కోలాటం ఆడుతున్న మహిళలు.



మామిదాలపాడులో గణేశుని శోభాయాత్రలో డాన్స్ చేస్తున్న చిన్నారులు

బైబై వినాయకా!

- ఘనంగా వినాయక నిమజ్జనం

కర్నూలు న్యూటౌన్: ఆది దేవుడు వినాయకుడికి వీడ్కోలు పలికారు. తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథులను మంగళవారం నిమజ్జనానికి తరలించారు. గణేశ్ విగ్రహాల ఊరేగింపులు డీజేలు, డ్రమ్స్‌ల సౌండ్స్‌కు చిన్నాపెద్దా తేడా లేకుండా నృత్యం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. బైబై గణేశా.. అంటూ



భక్తులు మధ్య ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న బాలాజీ నగర్‌లో గణేశుడు,



మాసా మసీదు వద్ద గంగమ్మ ఒడికి చేరుకుంటున్న గణనాథుడు

రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతాం

- ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను రైతు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం కర్నూలు ఏ.క్యాంపులోని ఉద్యాన భవన్‌లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పనిచేస్తున్న రైతు శాస్త్రవేత్తలు, మెంటర్స్ తదితరులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సహజసిద్ధ సాగు పద్ధతులు, మోడల్స్‌పై శిక్షణ ఇవ్వడం వల్ల వారి స్వంత భూముల్లో ప్రకృతి వ్యవసాయ నమూనాలను ఏర్పాటు చేయాలన్నారు. రీజినల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ చక్రాల చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని ఏ విధంగా తగ్గించుకోవచ్చనే దానిని మోడల్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించవచ్చన్నారు. కెమికల్స్ లేకుండా పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉందన్నారు. నేలను సారవంతం చేసేందుకు ఘన, ద్రవ జీవామృతంతో పాటు నవ ధాన్యాలలు వేసుకోవాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలను ప్రభుత్వం ప్రత్యేకంగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. సమావేశంలో కన్సల్టెంట్ రాజేశ్వర్, సీనియర్ అసోసియేట్ వరలక్ష్మి, థిమాటిక్ పాయింట్ పర్సన్ చిరంజీవి, జిల్లా పాయింట్ పర్సన్స్ శ్వేత, సలీమ్, సందీప్ డీపీఎంయూ సభ్యుడు మల్లికార్జున పాల్గొన్నారు.

ఇంటింటికీ 'జగనన్న ఆరోగ్య రక్ష'



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఇంటింటికీ ఆరోగ్య రక్ష నినాదంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ పరిధిలోని స్టాంటన్‌పురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వేను డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట వలంటీర్లు ఇంటింటికి తిరిగి వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం గురించి కరపత్రం పంపిణీ చేసి అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓలు ఇంటింటికీ తిరిగి అవసరమైన వారికి ఏడు రకాల ఆరోగ్య పరీక్షలైన బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, యూరిన్, గళ్ల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వాటి ఫలితాలను జేఏఎస్ యాప్‌లో నమోదు చేసి ఆరోగ్య సేవలు అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ ఇచ్చి సెప్టెంబర్ 30వ తేదీ నుంచి విలేజ్ హెల్త్ క్లినిక్/యూపీహెచ్‌సీలలో ఇద్దరు ఎంబీబీఎస్‌లు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులచే నిర్వహించే వైద్యశిబిరాలకు తరలించి తగు చికిత్సలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జాషువా జయంతి సభ

కర్నూలు కల్చరల్: కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో బుధవారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సభను నిర్వహించనున్నట్లు తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ జి.ప్రమీల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

నందికొట్కూరు: రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెరికల్చర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షేక్షావలి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి చిన్న కార్తిక్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న కర్నూలులోని స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్–19 ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు.

కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్న తరుణంలో కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైతాంగం కరువు బారిన పడి అల్లాడిపోతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. అన్నదాతను ఆదుకోవడానికి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని కోరారు.

గణాధిపతికి పూజలు



వినాయకుడికి సహస్ర దీపాలంకరణ

శ్రీశైలం: దేవస్థానం ఉద్యోగ సిబ్బంది వసతిగృహాల వద్ద ఏర్పాటు చేసుకున్న వినాయకునికి మంగళవారం రాత్రి ప్రత్యేకంగా తయారు చేసిన ఊయలలో గణనాథులను వేంచేయింపజేసి ఊయల సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మల్లికార్జున కల్యాణ మండపంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి సహస్రదీపాలంకరణ శోభతో మండప ప్రాంగణం కళకళలాడింది. శివలింగాకృతి వివిధ రూపాలలో సహస్ర ప్రమిదలను వెలిగించారు.